సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉందని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతుల కారణంగా మంగళవారం గొడవెల్లి 33 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని రూరల్ ఏఈ పవన్‌చంద్ సోమవారం తెలిపారు. గొడవెల్లి, బాసరేగడి, జ్ఞానాపూర్, సాకెత్ విల్లాస్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలివేయనున్నట్లు ప్రకటించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కీసర: మహిళా ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత-2023 అవార్డుల కోసం పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు నాగారం మున్సిపల్ కమిషనర్ వాణి తెలిపారు. ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తులను పురపాలక సంఘ కార్యాలయంలో అందజేయాలని, ఎంపికైన వారికి జూన్ 5న జరగనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో అవార్డులు అందజేస్తామని చెప్పారు.

వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

శామీర్‌పేట్: వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి బలరామరావు సోమవారం విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటనలో అన్నారు. తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్‌లోని ఎస్సీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ బిల్డింగ్‌లో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో 6వ బ్యాచ్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. బ్యాచ్‌లో టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్, మొబైల్ సర్వీసింగ్, డొమెస్టిక్ ఎలక్ట్రీషన్, సోలార్ టెక్నీషియన్, సీసీ టీవీ కెమెరా రిపేరింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు సెల్: 9701214079, 9290217274 నంబర్లను సంప్రదించాలన్నారు.

రీసెర్చ్ బేస్డ్ ఇంటర్న్ షిప్‌కు విద్యార్థుల ఎంపిక

శామీర్‌పేట్: రీసెర్చ్ బేస్డ్ ఇంటర్న్ షిప్‌కు జగద్గిరిగుట్ట తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రాత్, అధ్యాపక బృందం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ప్రోగ్రాంకు బీ.కాబ్ బీఏ-2 మాధురి, ఎంఎస్‌సీఎస్-2 శ్రావణిలు ఎంపికయ్యారని, ఇంటర్నల్ సెక్యూరిటీ, ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్ ఆఫ్ ఇండియా అనే అంశంపై శిక్షణ పొందుతున్నారని వివరించారు.

క్లుప్తంగా...

ఎంఆర్‌టీఈ కళాశాలలో రక్తదాన శిబిరం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని ఎంఆర్‌టీఈ కళాశాలలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ, కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 200 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్ సుధీర్‌రెడ్డి, ఏఓ రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ టీబీ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



శామీర్‌పేట్: అక్రమ నిర్మాణాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఆర్ఐ కుమార్ హెచ్చరించారు. తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్ సర్వే నంబర్ 709లో వెలసిన అక్రమ నిర్మాణాలను సోమవారం కూల్చివేశారు.

మల్లు స్వరాజ్యం వర్ధంతి



మల్లు స్వరాజ్యం వర్ధంతిలో సీపీఎం మండల కార్యదర్శి సబిత

పోచారం: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతిని అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరాజ్యం చిత్రపటానికి సీపీఎం మండల కార్యదర్శి ఎన్.సబిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం కమిటీ సభ్యులు జి.నాగమణి, అలివేలు, అరుణారెడ్డి, శోభ, ప్రమీల, అంజలి, రమ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకంపై ఆశలు..!

నగరంతో సహా శివారు జిల్లాల్లోని 28 నియోజకవర్గాలలో 84 వేల మందికి లబ్ధి

- ప్రతీ నియోజకవర్గంలో 3 వేల మందికి పథకం వర్తించేలా చర్యలు
- రాజకీయ జోక్యం లేకుండా నిజమైన పేదలకు అందించాలని ఆదేశాలు
- లబ్ధిదారుల ఎంపిక కోసం కొనసాగుతున్న సర్వే
- ఈ పథకం కింద ప్రతి లబ్ధిదారుకి రూ.3లక్షల ఆర్థిక సాయం
- 3 విడతల్లో అందించేందుకు చర్యలు
- లబ్ధి పొంది గూడు కట్టుకోవాలని నిరుపేదల ఎదురు చూపులు



సాక్షి,మేడ్చల్ జిల్లా: సొంత జాగా ఉన్న నిరు పేదల ఇళ్ల నిర్మాణం కోసం గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. దీంతో ఈ పథకంలోనైనా లబ్ధి పొంది గూడు నిర్మించుకుందామని హైదరాబాద్ నగరంతో పాటు శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని నిరుపేదలు ఎదురు చూస్తున్నారు. సర్కారు నుంచి పథకంపై స్పష్టమైన మార్గదర్శకాలు వచ్చిన వెంటనే అధికారులు దరఖాస్తులను ఆహ్వానించనున్నారు. ఈ పథకం అమలుపై సమగ్ర పర్యవేక్షణ జిల్లా కలెక్టర్లకే ప్రభుత్వం అప్పగించింది. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ కూడా ప్రస్తుతం కలెక్టర్లే పర్యవేక్షిస్తున్నారు. రాజకీయ జోక్యం లేకుండా నిజమైన పేదలకు ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో కలెక్టర్లు సైతం ఏ ప్రాంతంలో ఎంత మంది పేదలున్నారు? వారి ఆర్థిక పరిస్థితులేంటీ? అనే విషయాలపై సంబంధిత రెవెన్యూ అధికారుల ద్వారా సర్వే చేయిస్తున్నారు.

84వేల మందికి రూ.2520 కోట్లు..

నగరంతో సహా శివారు జిల్లాల్లోని 28 నియోజకవర్గాలకు గానూ 84 వేల మందికి రూ.3 లక్షల చొప్పున సుమారు రూ.2520 కోట్ల ఆర్థిక సాయం మూడు విడతల్లో అందనుంది. హైదరాబాద్ జిల్లాలో 15 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 45 వేల మందికి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 5 నియోజకవర్గాల్లో 15 వేల మందికి, రంగారెడ్డి జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో 24 వేల మంది చొప్పున మొత్తంగా 84 వేల మంది నిరుపేదలకు లబ్ధి చేకూరే అవకాశముంటుంది.

ఎక్కువ మంది కోసం ఎమ్మెల్యేల వినతి

గృహలక్ష్మి పథకం కింద ప్రస్తుతం నియోజకవర్గానికి మూడు వేల మందికి ఆర్థిక సాయం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే సొంతింటి కోసం ఇప్పటికే ప్రతి నియోజకవర్గం నుంచి వేల సంఖ్యలో ప్రభుత్వ అధికారులకు దరఖాస్తులు అందాయి. తాజాగా నియోజకవర్గానికి కేవలం మూడు వేల మందికే ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వం ప్రకటన చేయడంపై సొంత పార్టీ ఎమ్మెల్యేల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పలు నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు కొంత మందికి మాత్రమే డబుల్ బెడ్రూమ్ ఇళ్లు అందాయి. చాలామంది దరఖాస్తు చేసి, ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు బదులు ప్రస్తుతం ప్రతీ నియోజకవర్గానికి మూడు వేల మందికి మాత్రమే గృహలక్ష్మి పథకం కింద ఆర్థిక సాయం అందిస్తే చాలా మంది పార్టీకి, వ్యక్తిగతంగా ఎమ్మెల్యేలకు వ్యతిరేకమయ్యే అవకాశాలున్నాయి. వీలైనంత ఎక్కువ మందికి ఆర్థిక సాయం చేయాలని, త్వరలోనే సీఎంను కలుస్తామని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు.

వ్యతిరేకత వస్తుందేమోనని ఎమ్మెల్యేల్లో ఆందోళన...

నగరంతో సహా శివారు జిల్లాల్లో నిర్మాణాలు పూర్తయిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లు అర్హులైన పేదలకు పంపిణీ చేయకపోగా.. మరికొన్ని చోట్ల నిర్మాణంలో ఉన్న ఇళ్లు నత్తకు నడక నేర్పుతున్నాయి. దీంతో తాజా గృహలక్ష్మి పథకంతో క్షేత్రస్థాయిలో అనుకూలత కంటే వ్యతిరేకత ఎదురయ్యే అవకాశాలున్నాయని, రాబోయే సాధారణ అసెంబ్లీ ఎన్నికలు దృష్ట్యా ఈ పరిణామం ఇబ్బందికరంగా మారుతుందేమోనని ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ప్రతీ సోమవారం కలెక్టరేట్లతో సహా డివిజన్, మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందజేస్తున్న దరఖాస్తుల్లో కూడా సుమారు 60 శాతానికి పైగా దరఖాస్తులు డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసమే చేసుకుంటున్నారు. ఈ నెలాఖరులోగా గృహలక్ష్మి పథకంపై స్పష్టమైన మార్గదర్శకాలు రాగలవని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

భూ నిర్వాసితులకు కాంగ్రెస్ అండగా ఉంటుంది

కలెక్టరేట్ వద్ద ధర్నాలో టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి



రైతులతో కలిసి డీఆర్ఓ లింగ్యానాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: కేశ్వాపూర్ రిజర్వాయర్ భూనిర్వాసిత రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడి వారికి న్యాయం జరిగేంత వరకు పోరాడుతుందని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, జెడ్పీ ఫ్లోర్ లీడర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ వద్ద భూ నిర్వాసితులు సోమవారం నిర్వహించిన ధర్నాలో పాల్గొని మాట్లాడుతూ.. రిజర్వాయర్ నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కానందున రైతుల వద్ద నుంచి బలవంతంగా సేకరించిన భూములను వెంటనే వారికి తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రైతుబంధు సొమ్మును కూడా వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. రైతులు పండించిన పంట ఉత్పత్తులను ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని, రెవెన్యూ అధికారులు తమ వద్ద పెట్టుకున్న పట్టాదారు పాసు పుస్తకాలను సంబంధిత రైతులకు అందజేయాలన్నారు. జిల్లా మంత్రి మల్లా రెడ్డి రైతులు పడుతున్న ఇబ్బందులపై వెంటనే స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం వారి సమస్య ను పరిష్కరించాలన్నారు. సమస్యలను మంత్రి పట్టించుకోకపోతే కలెక్టరేట్ ఎదుట రైతులతో కలసి కాంగ్రెస్ పార్టీ ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటుందని ఆయన హెచ్చరించారు. రైతుల గోడును టీపీసీసీ అధ్యక్షుడు, మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ధర్నా అనంతరం డీఆర్ఓ లింగ్యానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో మూడు చింతలపల్లి, శామీర్‌పేట, తూంకుంటకు చెందిన కాంగ్రెస్ నాయకులు నర్సింహులుయాదవ్, వైఎస్ గౌడ్, జైపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, బిక్షపతి, కోదూరి అశోక్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనంతలక్ష్మి, కేశ్వాపూర్ గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

ప్రజల అర్జీలను పరిష్కరించాలి



కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో ప్రజలు అందించిన 78 అర్జీలను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులకు డీఆర్ఓ లింగ్యానాయక్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ఆయన స్వీకరించారు. ఈ

చంద్రమౌళి, పృథ్వీల అక్రమ అరెస్టు హేయం



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జవహర్‌నగర్: దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రమౌళి, లా చదువుతున్న అతడి కుమారుడు పృథ్వీరాజులను ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ములుగు పోలీసులు అక్రమ అరెస్టు చేయాడాన్ని జవహర్‌నగర్ ప్రజా సమస్యల సాధన కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సోమవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం తెలిపారు. జవహర్‌నగర్‌లో నివాసముంటున్న చంద్రమౌళి, అతడి కుమారుడు పృథ్వీరాజ్‌ను ఎలాంటి కారణాలు చూపకుండా పోలీసులు అప్రజాస్వామికంగా అరెస్టు చేసిన తీరుపై మండిపడ్డారు. ఇప్పటికైనా బేషరతుగా వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. షేక్‌షావలి, వి.ప్రవీణ్ కుమార్, శివబాబు, పాషామియా, మల్లేష్, పుణ్యవతి, మబ్బు బాలు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే ఈటల పుట్టిన రోజు వేడుకలు



ఘట్‌కేసర్: హుజురాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ చేరికల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఈటల రాజేందర్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఈటల నివాసానికి తరలివెళ్లతి ఆయనను పూలమాల, శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో మేయర్ మేకల కావ్య

జవహర్‌నగర్: బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం జవహర్‌నగర్ మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్, కార్పొరేటర్లు, కోఆప్షన్లు, బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఆయన నివాసానికి తరలివెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కొర్రెముల్ గ్రామ నేతలు...

ఘట్‌కేసర్: బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సోమవారం కొర్రెముల్ గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు దుర్గరాజ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్ గౌడ్, మన్నెం ముదిరాజ్, యాదగిరి, నాగేశ్, బాలరాజ్ పాల్గొన్నారు.



వేడుకల్లో బీఆర్ఎస్ జవహర్‌నగర్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్



మహేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొర్రెముల్ నాయకులు

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ వేమనరెడ్డి

ఘట్‌కేసర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఘట్‌కేసర్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని 14వ వార్డులో కమిషనర్ వేమనరెడ్డితో కలిసి సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వసంత, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సిరాజ్, పీహెచ్ఎన్ విమల, డీఈఓ సాత్విక్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న పవన్, కృష్ణగౌడ్, అర్జున్

ఘట్‌కేసర్: ఘనాపూర్‌లో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు బీఆర్ఎస్ ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు పవన్‌నాయక్ ఆధ్వర్యంలో సోమవారం చెక్కులు అందజేశారు. అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందిన పకీర్‌టెక్య తండాకు చెందిన విష్ణుకు రూ.25 వేలు, లక్ష్మికి రూ.45 వేలు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరయ్యాయి. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ మహేందర్, మాజీ ఉప సర్పంచ్ అర్జున్, మాజీ వార్డు సభ్యుడు కృష్ణగౌడ్, బీఆర్ఎస్ స్థానిక శాఖ ప్రధాన కార్యదర్శి సురేశ్, మాజీ అధ్యక్షుడు రాజుగౌడ్ పాల్గొన్నారు.

డీఈఓకు అభినందనలు

ఘట్‌కేసర్: కేంద్ర విద్యాశాఖ అవార్డు గ్రహీత మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి విజయకుమారికి ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి సోమవారం అభినందనలు తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆమె కార్యాలయంలో డీఈఓను కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. లాక్‌డౌన్ సమయంలో సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగకుండా 'మేడ్చల్ బడి డాట్ కామ్' ద్వారా ఆన్‌లైన్ క్లాసులతో నాణ్యమైన విద్యను బోధించినందుకు అవార్డుకు ఎంపికైంది. కార్యక్రమంలో ఎంపీటీసీ శోభారాణి, రాజశేఖర్‌రెడ్డి, సాయిలు, బస్వరాజ్, అజయ్‌యాదవ్, నరేశ్ పాల్గొన్నారు.



డీఈఓకు అభినందనలు తెలుపుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ శోభారాణి

కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో విద్యార్థుల నృత్యాలు

మేడ్చల్: కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వార్షికోత్సవం సోమవారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహారెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు మహేష్, శివకుమార్‌యాదవ్, స్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యులు గీతామాధురి, పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దీపికారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి మహిళా కళాశాలలో 'సంతోష దినోత్సవం'



కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు

మేడ్చల్‌రూరల్: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా కళాశాలలో సోమవారం సంతోష దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాధవిలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు తెలుపు రంగు దుస్తులు ధరించి వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. బ్రహ్మకుమారీస్‌కు చెందిన మురళీమనోహర్, గీతాలు పాల్గొని ఆనందాన్ని ఎలా సాధించగలమనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

కుషాయిగూడ: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం మల్లాపూర్‌లో ఎన్వీఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కనుసన్నల్లో నడిచే సిట్ విచారణపై తమకు నమ్మకం లేదన్నారు. మియాపూర్ భూముల కుంభకోణం, ఇంటర్మీడియట్ మూల్యాంకనం, డ్రగ్స్ కేసుల్లో సిట్ ఎలాంటి పురోగతి సాధించలేదన్నారు. ప్రతి కేసులోనూ కల్వకుంట్ల కుటుంబ భాగస్వామ్యం ఉందని ఆరోపించారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో హబ్సిగూడ కార్పొరేటర్ చేతన హరీష్, రామంతాపూర్ కార్పొరేటర్ శ్రీవాణి, బీజేపీ నేతలు బాలచందర్, రవినాయక్, మునుగంటి రాంప్రదీప్, గోపాల్‌గౌడ్, కృష్ణ, మహంకాళి, బాలకృష్ణ, నాదం, శిల్పారెడ్డి, అపర్ణ, సతీష్, ప్రకాష్, అనిత, దేవేందర్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ అంత్యోదయ'పై గ్రామ సభలు



పథకాలపై చర్చిస్తున్న సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మిషన్ అంత్యోదయ గ్రామ సభలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అవుషాపూర్, మాదారం, మర్పల్లిగూడ, ఎదులాబాద్, ప్రతాపసింగారం, అంకుషాపూర్, వెంకటాపూర్‌లో జరిగిన గ్రామ సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై చర్చించారు. ఈ సభల్లో కావేరిమశ్చేందర్‌రెడ్డి, యాదగిరి, మంగమ్మ, శివశంకర్, సరేశ్, గీత, ఉప సర్పంచులు ఐలయ్యయాదవ్, లింగేశ్వర్‌రావు, సత్యనారాయణ, నరేశ్, రాజముదిరాజ్, కార్యదర్శి గౌతమి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

భూ క్రమబద్ధీకరణకు మరో అవకాశం

- ఏప్రిల్ 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు దరఖాస్తులకు గడువు
- ఇప్పటి వరకు జీఓ 58, 59ల కింద వచ్చినవి 62,538
- జీఓ 59 కింద అర్హత సాధించినవి 15 వేలు మాత్రమే
- తిరస్కరించిన దరఖాస్తులను మళ్లీ పరిశీలించే అవకాశం

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్న వారికి జీఓ 58, 59 కింద క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఏప్రిల్ 1 నుంచి 30 వరకు పెంచుతూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అభ్యంతరం లేని భూముల క్రమబద్ధీకరణకు 58, 59 జీఓలను 2014 డిసెంబరు 30న జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆక్రమణదారుల ఆధీనంలో ఉండి నిర్మాణాలు చేసుకున్న ప్రభుత్వ భూములు, పట్టణ భూగరిష్ట పరిమితి చట్టం ప్రకారం స్వాధీనం చేసుకున్న మిగులు భూములను క్రమబద్ధీకరించనున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. 2014 జూన్ 2కు ముందు స్వాధీనంలో ఉన్న వారికే క్రమబద్ధీకరణ చేస్తామని గతంలో తెలుపగా, ఈ తేదీని కూడా 2020 జూన్ 2కు పెంచుతున్నామని తాజా ఉత్తర్వుల్లో ప్రభుత్వం తెలిపింది. ఆక్రమణల్లో ఉన్న సింగరేణి సంస్థ భూముల క్రమబద్ధీకరణకు జిల్లా కలెక్టర్లకు దరఖాస్తు చేసుకోవాలని 2019 జులై 11న ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ గడువును కూడా 2023 ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకూ పొడిగిస్తూ మరో ఉత్తర్వును ప్రభుత్వం జారీ చేసింది.

గతంలో ఇలా..

జీఓ నంబర్ 58, 59 కింద క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకునేందుకు 2022 మార్చి 31వ తేదీ వరకు అవకాశం కల్పించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జీఓ 58 కింద 33,258 దరఖాస్తులు రాగా, జీఓ 59 కింద 28,280 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారుల వివరాలతో గత జులైలో ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాయి. ఇందులో జీఓ నంబర్ 58 కింద మాత్రమే అధికారులు అర్హులను గుర్తించారు. జీఓ 59 కింద 80 శాతం దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. జిల్లాలో ఈ జీఓ కింద వచ్చిన దరఖాస్తుల్లో 15 వేలు మాత్రమే అర్హత సాధించినవిగా అధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారిని గుర్తించారు. ఎమ్మెల్యేలతో పట్టాలు పంపిణీ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో ప్రభుత్వం మరోసారి దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

నిబంధనలు ఇవీ...

2015లో జారీ చేసిన జీఓ 58, 59 సక్రమంగా అమలు కాలేదని విమర్శల నేపథ్యంలో ప్రభుత్వం 2022 ఫిబ్రవరిలో జీఓ నంబర్.58, 59లకు అనుబంధంగా జీఓ 14ను జారీ చేసింది. దీని ప్రకారం.. 2014 జూన్ 2వ తేదీ కంటే ముందు ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఉన్నట్లు ఆధారాలు సమర్పించిన వారి స్థలాలను క్రమబద్ధీకరణ చేస్తారు. 125 చదరపు గజాల స్థలం వరకు ఎలాంటి రుసుము వసూలు చేయకుండా ప్రభుత్వమే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తుంది. 125 చదరపు గజాల కంటే ఎక్కువగా ఉంటే స్థానికంగా భూముల రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం ధరలు చెల్లిస్తే క్రమబద్ధీకరణ పూర్తి చేసి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తారు.